



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
మే 31, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

## జీవో 17 రద్దు వరకు పోరాటం చేస్తాం: కేటీఆర్

- రేవంత్‌రెడ్డి నాయకత్వంపై కేటీఆర్ విమర్శలు
- చిన్న కాంట్రాక్టర్లకు నష్టం కలిగిస్తున్న జీవో 17పై ఆందోళన
- కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతోందన్న ఆరోపణ
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వేలాది మందికి అవకాశాలు కల్పిస్తామన్న హామీ
- హైదరాబాద్‌లో జరిగిన రెండు కార్యక్రమాల్లో ప్రభుత్వంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో ఆ అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపై కూడా విమర్శలు గుప్పించిన కేటీఆర్, ప్రస్తుత పాలన అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న కేటీఆర్, జీవో 17 కారణంగా చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల వ్యవస్థలో బలహీన వర్గాలకు అవకాశాలు పెంచుతామని చెప్పి, ఇప్పుడు పెద్ద సంస్థలకు మాత్రమే ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వ పనుల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని కేటీఆర్ ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లకు కేటాయించిన పనులు, విడుదల చేసిన నిధుల వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 17 అమలుతో స్థానిక కాంట్రాక్టర్లు నష్టపోతుండగా, పెద్ద కంపెనీలకు లాభం చేకూరుతోందని

(మిగతా 2వ పేజీలో)

# ఉచిత విద్యుత్ ఎత్తేయం

### ఈ రెండూ చేయాల్సి వస్తే మేం ఎన్నికల్లోనే పోటీ చేయం

- మేం అవి చేయకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా?
- కుప్పకూలిన డిస్కంలను బతికించేందుకే రైతు డిస్కం తెచ్చాం
- సాగుకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఎప్పుడూ నిబంధన విధించలేదు
- రైతుల కోసం తానేదో యుద్ధం చేశానని చెప్పుకునేందుకే నాడు కేసీఆర్ అలా చెప్పారు
- కేంద్రం ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ట్రాక్టర్లలో తెచ్చి పోస్తాం
- జూన్ 15 లోపు ధాన్యమంతా కొంటాం
- కల్వకుంట్ల కుటుంబమంతా అబద్ధాల మీదనే బతుకుతుంది

హైదరాబాద్: రాష్ట్ర రైతాంగానికి 24 గంటలూ నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని, ఆ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఎత్తేసేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన తమకు లేదని తేల్చిచెప్పారు. అసలు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలన్న నిబంధన కేంద్రం ఎప్పుడూ పెట్టలేదని చెప్పిన రేవంత్.. ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్ల విషయంలో బీఆర్ఎస్‌కు సవాల్ చేశారు. ఉచిత విద్యుత్ ఎత్తేసినా, వ్యవసాయానికి మీటర్లు పెట్టినా వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని, తాము అలా చేయకపోతే బీఆర్ఎస్



పోటీ నుంచి తప్పుకుంటుందా అని వ్యాఖ్యానించారు. శనివారం రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. 'మేం అధికారంలోకి వచ్చేసరికి తెలంగాణలోని డిస్కంలు కుప్పకూలే పరిస్థితిలో ఉన్నాయి. డిస్కంలకు ఇప్పుడు రూ.69,745 కోట్ల అప్పులున్నాయి. అవి బాగుచేయలేనంతగా నిర్వీర్యమయ్యాయి. ఉచిత విద్యుత్ కింద రైతులకిచ్చే కరెంటుకు ఒక్క రూపాయి కూడా గత ప్రభుత్వం డిస్కంలకు చెల్లించలేదు. దీంతో డిస్కంలు అప్పులు చేసి బొగ్గు, విద్యుత్ కొనుగోలు

(మిగతా 2వ పేజీలో)



# బాల్క సుమన్ అరెస్ట్

### 14 రోజుల రిమాండ్ విధింపు

### సింగరేణి వ్యాఖ్యల కేసులో చర్యలు..

### తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్: సింగరేణి కార్యాలయాలు, రైల్వే మార్గాలపై చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ నాయకుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. అరెస్టుకు ముందు తెలంగాణ భవన్ వద్ద కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాల్క సుమన్ అక్కడ ఉన్నారన్న సమాచారంతో పోలీసులు చేరుకోగా, పార్టీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు, న్యాయవాదుల మధ్య చర్చలు జరిగాయి. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినందున చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. కొద్దిసేపటి తర్వాత బాల్క సుమన్ మీడియాతో మాట్లాడగా, అనంతరం పోలీసులు ఆయనను నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకోగా, భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత సంఖ్యలోనే వారిని లోనికి అనుమతించారు. పోలీసులు పలుగంటల పాటు సుమన్‌ను విచారించారు. సింగరేణి కార్యాలయాలు, రైల్వే పట్టాలపై చేసిన వ్యాఖ్యల ఉద్దేశ్యం ఏమిటి, వాటి వల్ల ప్రజల్లో ఎలాంటి ప్రభావం పడే అవకాశం ఉందన్న

(మిగతా 2వ పేజీలో)

# రాజస్తాన్, ఢిల్లీ అతలాకుతలం

### దుమ్ము తుపాను, భీకర గాలుల బీభత్సం

న్యూఢిల్లీ/జైపూర్: ప్రకృతి ప్రకోపానికి శనివారం దేశరాజధాని ఢిల్లీ--ఎన్సీఆర్ ప్రాంతాలతోపాటు రాజస్తాన్ అతలాకుతలమైంది. జాతీయరాజధాని పరిధి(ఎన్సీఆర్)లోని చాలా చోట్ల వరుణుడు తన ప్రతాపం చూపించాడు. దీనికితోడు గంటకు 70 కిలోమీటర్ల వేగంతో దుమ్ము గాలులు వీస్తూ స్థానికులను తీవ్ర ఇబ్బందులపాల్జేశాయి. థార్ ఎడారికి నిలయమైన

2లో





# సీఎల్పీ నేతగా డీకేఎస్ ఏకగ్రీవం

- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్ర గవర్నర్
- 3న కర్ణాటక నూతన సీఎంగా శివకుమార్ ప్రమాణ స్వీకారం

# రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న కిషన్ రెడ్డి
- రైతులు ఇబ్బంది పడుతుంటే.. మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని విమర్శ



## రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు

మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతుల్లో చిక్కి రైతులు విలవిలలాడుతుంటే, మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టేయాలని చూస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఎప్పుడూ తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు. ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మంత్రాలయం వద్ద విషాదం.. తుంగభద్రలో ఐదుగురు గల్లంతు

కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు.

## రాజస్తాన్, ఢిల్లీ అతలాకుతలం

రాజస్తాన్‌లో ఇసుక తుపాన్ల ధాటికి జనజీవనం కొన్ని గంటలపాటు స్తంభించిపోయింది. దుమ్ము తుపాన్లకు పిడుగులు, మెరుపులు తోడవడంతో ఢిల్లీ--ఎన్సీఆర్, రాజస్తాన్ వాసులు శనివాం ప్రకృతి ప్రకోపానికి గురికావాల్సి వచ్చిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వాయవ్య భారతంలో రుతుపవనాల ఆగమనానికి సూచికగా ఉరుములు, మెరుపులతో కూడిన భీకర గాలులు వీయడాన్ని ఆందీగా పిలుస్తారు. మే చివరివారంలో ప్రకృతి ఇలా దుమ్ము తుపాన్ల రూపంలో వాయవ్య భారతాన్ని చుట్టేస్తుంది. ఎండాకాలంలోని చండ ప్రచండ వేడిమికి భూమి ఉపరితలం అత్యధికంగా వేడెక్కుతుంది. దీంతో గాలిలో స్థిరత్వం అదుపుతప్పుతుంది. దీనికి ధూళి గాలులు తోడై దుమ్ము తుపానులను సృష్టిస్తాయి. వీటికి సమీపంలోని థార్ ఎడారికి నిలయమైన రాజస్తాన్ గుండా ఇసుకరేణువులు గాలితోపాటు ఎగిరొచ్చి ఢిల్లీ--ఎన్సీఆర్‌లో ధూళి బీభత్సం సృష్టిస్తున్నాయి. రాజస్తాన్‌లోని చాలా ప్రాంతాల్లో శనివారం సైతం ఇసుక తుపాన్లు, వర్షం స్థానికులను తెగ ఇబ్బందులకుగురిచేశాయి. దుమ్ముతోపాటు ఇసుక గాల్లోకి లేవడంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రహదారులపై దుమ్ము కమ్ముకుంది. దీంతో ప్రయాణికులకు రహదారులపై ఏముందో కని?పంచకపోవడంతో డ్రైవర్లు పట్టపగలే హెడ్‌లైట్లు ఆన్‌చేసుకుని జాగ్రత్తగా ప్రయాణాలు కొనసాగించారు. హనుమాన్‌గఢ్, శ్రీ గంగానగర్ రీజియన్లలో ఇసుక తుపాను ప్రభావం ఎక్కువగా కన్పించింది. భీకర గాలుల ధాటికి చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. గత 24గంటల్లో ఛురు, హనుమాన్‌గఢ్, శ్రీ గంగానగర్, బికనీర్, నాగౌర్, దిద్వానా--కుఛమాన్, ఆల్వార్, సికార్‌లలో తుపాను బీభత్సం సృష్టించింది. "ఇంతటి ఇసుక తుపాను జీవితంలో చూడలేదు. మధ్యాహ్నం 2 గంటలకు ఒక్కసారిగా నగరంలో చీకట్లు కమ్ముకున్నాయి"అని ఛురు నగర వాసి చెప్పారు. దుమ్ము తుపాన్లతోపాటు ఉరుములతో కూడి వర్షాలు పడ్డాయి.

## కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి జీవో 17 రద్దు వరకు పోరాటం చేస్తాం: కేటీఆర్

అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టుల కేటాయింపులో పారదర్శకత లేదని, కొందరు ప్రభావశీల వ్యక్తులకు మాత్రమే అవకాశాలు లభిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే వెనుకబడిన వర్గాలకు చెందిన యువతను పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. జీవో 17 రద్దు అయ్యే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో కూడా కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కొనసాగించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలు అమలు కాలేదని, నిరుద్యోగులు ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఆశించిన ఫలితాలు చూపలేకపోయిందని విమర్శించారు. హైదరాబాద్‌లో పేదల కోసం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమాలపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు కొత్త ఇళ్లు అందించడంపై కన్నా, పలు ప్రాంతాల్లో ఇళ్ల కూల్చివేతలే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

## బాల్క సుమన్ అరెస్ట్

అంశాలపై ప్రశ్నలు అడిగి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన సింగరేణి భద్రతా విభాగానికి చెందిన అధికారుల వాంగ్మూలాలు కూడా రికార్డు చేశారు. విచారణ అనంతరం సుమన్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రిమాండ్ ప్రక్రియలో భాగంగా అవసరమైన పత్రాల విషయంలో కొంత ఆలస్యం చోటుచేసుకోవడంతో న్యాయస్థానం అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం అవసరమైన పత్రాలు సమర్పించడంతో విచారణ కొనసాగి రిమాండ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అరెస్టుకు ముందు మాట్లాడిన బాల్క సుమన్ తనపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. తాను ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడలేదని, ప్రజా సమస్యలపైనే స్పందించానని చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఈ అరెస్టుపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని పార్టీ నాయకులు ఆరోపించారు. భావ ప్రకటన స్వేచ్ఛను పరిమితం చేసే ప్రయత్నంగా ఈ వ్యవహారాన్ని చూస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా అంశాలపై మాట్లాడినందుకే సుమన్‌పై చర్యలు తీసుకున్నారని వారు విమర్శించారు. అయితే పోలీసులు మాత్రం ఫిర్యాదు, చట్టపరమైన నిబంధనల ప్రకారమే కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేస్తున్నారు.

# సీఎల్పీ నేతగా డీకేఎస్ ఏకగ్రీవం

బెంగళూరు: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) నేతగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ సజావుగా సాగింది. బెంగళూరు విధానసౌధలో శనివారం సాయంత్రం 4 గంటలకు సీఎల్పీ సమావేశం జరిగింది. ఐఈ భేటీలో స్పీకర్ యూటీ ఖాదర్ సహా నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేర్వేరు కారణాలతో హాజరు కాలేకపోయారు. మిగిలిన ఎమ్మెల్యేలందరూ పాల్గొన్నారు. అనుకున్న సమయానికే డీకే శివకుమార్ విధానసౌధకు చేరుకున్నారు. విధానసౌధ గడపకు నమస్కరించి లోపలికి వెళ్లారు. సీఎల్పీ నాయకుడిగా డీకే శివకుమార్ పేరును ఆపద్ధర్మ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించారు. "మన శాసనసభాపక్ష నాయకుడు డీకే శివకుమార్"అంటూ ఏకవాక్య తీర్మానాన్ని ప్రతిపాదించగా, కాంగ్రెస్ సీనియర్ నేత, హోంమంత్రి పరమేశ్వర ఆమోదించారు. తర్వాత ఎమ్మెల్యేలందరూ చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం సీఎల్పీ నేతగా శివకుమార్ ఎన్నికైనట్లు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులుగా కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సూర్జేవాలా పాల్గొన్నారు. అయితే, ఈ



భేటీ మధ్యలో 10 నిమిషాలపాటు విరామం తీసుకోవడం విశేషం. సిద్ధరామయ్య, కేసీ వేణుగోపాల్, సూర్జేవాలా ప్రత్యేకంగా మరో గదిలో కొద్దిసేపు సమావేశమైనట్లు తెలిసింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఇన్నాళ్లూ అందించిన సేవలను కొనియాడుతూ సీఎల్పీ భేటీలో డీకే శివకుమార్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

### గవర్నర్‌తో భేటీ

సీఎల్పీ సమావేశం కంటే ముందు డీకే శివకుమార్ లోక్‌భవన్‌కు వెళ్లడం ఆశ్చర్యానికి గురిచేసింది. లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ కలిసి చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గం కూర్పుపై గవర్నర్‌కు సమాచారం అందించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం ప్రమాణ స్వీకారాన్ని జూన్ 3న సాయంత్రం 4.05 గంటలకు ఖరారు చేసుకున్నారు.

అదేరోజు మరో 14 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, సీఎల్పీ నేత ఎన్నిక పూర్తయిన తర్వాత డీకే శివకుమార్, సిద్ధరామయ్య, సీనియర్ నేతలు కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు గవర్నర్‌కు తెలియజేశారు. అసెంబ్లీలో తమకు సంపూర్ణ మెజార్టీ ఉందని తెలిపారు. ఈ మేరకు లేఖ అందించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ డీకే శివకుమార్‌ను గవర్నర్ ఆహ్వా?వనించారు.

### జూన్ 3న నిరాడంబరంగా ప్రమాణం

సీఎల్పీ భేటీలో డీకే శివకుమార్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ పలకరించారు. జూన్ 3న సాయంత్రం 4.05 గంటలకు లోక్‌భవన్‌లో ఆయన కర్ణాటక నూతన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత కొనసాగుతుండడంతోపాటు బెంగళూరులో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం చేయాలని డీకే శివకుమార్ నిర్ణయించారు.

# ఉచిత విద్యుత్ ఎత్తేయం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవాల్సి వచ్చేది. అందులో భాగంగానే రైతులతో పాటు ప్రభుత్వం గంపగుత్తగా కరెంటును వినియోగించుకునే కేటగిరీని కలిపి ప్రత్యేకంగా రైతు డిస్కం ఏర్పాటు చేశాం. దీనిద్వారా ఎంత విద్యుత్ తీసుకున్నామో, ఎంత సరఫరా చేశామో, నిర్వహణ నష్టాలు ఎంతో, బిల్లులు ఎంత వస్తున్నాయో కచ్చితంగా లెక్క తేలుతుంది. తెలంగాణ రైతాంగం రాత్రిపూట పెద్దగా వ్యవసాయానికి విద్యుత్ వాడదు కాబట్టి ధర తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేసి ఆ డిస్కం ద్వారా రైతులకు విద్యుత్ ఇస్తాం. అసలు మాకు ఉచిత విద్యుత్ ఎత్తేయాలనే ఆలోచనే లేదు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు కూడా పెట్టబోం. అలా పెట్టేది ఉంటే వచ్చే ఎన్నికల్లో మేం పోటీ చేయబోం. ఒకవేళ మేం పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ ఎత్తేయకపోయినా బీఆర్ఎస్ పోటీ చేయకుండా ఉంటుందా? బీఆర్ఎస్ నా సవాల్‌ను స్వీకరించాలి. అసలు స్మార్ట్ మీటర్ల విషయంలో కేంద్రంతో ఒప్పందం చేసుకుంది బీఆర్ఎస్సే. 2017, జూన్ 30న అజయ్‌మిశ్రా, రఘుమారెడ్డి, గోపాలరావు అనే అధికారులు ఈ ఒప్పందంపై సంతకాలు పెట్టారు. 2017--18లో 29,632 స్మార్ట్ మీటర్లు కూడా పెట్టారు. కేంద్రం ఏ రోజూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని అడగలేదు. అసలు అలాంటి నిబంధనే లేదు. నోరు తెరిస్తే కేసీఆర్ చెప్పేది అబద్ధాలే. రైతుల కోసం తామేదో యుద్ధం చేసినట్టు అప్పట్లో చెప్పుకుని రైతుల దగ్గర మార్కులు కొట్టేయాలని అలాంటి మాటలు చెప్పారు. రైతులు ఆయన కంటే తెలివైన వారు కాబట్టి కర్రు కాల్చి వాత పెట్టారు. మోదీ నా చుట్టమేమీ కాదు. ఆ పథకంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు చేరాయి. ఏపీ కూడా చేరింది. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రమంతటా స్మార్ట్ మీటర్లు పెట్టినా వ్యవసాయానికి మాత్రం పెట్టలేదు. తీగల మీద బట్టలు ఆరేయాలని కేసీఆర్ అన్నప్పుడే 1999 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసింది. కాంగ్రెస్సే. నాణ్యమైన విద్యుత్ ఇచ్చి రైతుల ఆత్మగౌరవం పెంచడానికి తెచ్చిన పారదర్శక విధానమే రైతు డిస్కం. సీఆర్‌పీసీ, ఐపీసీల్లో శిక్షలు వేసేందుకు నిబంధనలు లేవా? మరి ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, హెచ్ఆర్సీ, మైనార్టీ కమిషన్లు ఎందుకు ఏర్పాటు చేశారు. బీసీ కమిషన్‌ను ఎందుకు అడుగుతున్నారు.



తమ వర్గాలకు కమిషన్ ఉంటే న్యాయం జరుగుతుందనే కదా. ఆ తరహాలోనిదే రైతు డిస్కం కూడా.

### మోదీకి కిషన్‌రెడ్డి చెప్పాలి కదా?

బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి కేసుల్లో సీబీఐ విచారణను రాష్ట్ర ప్రభుత్వం కోరిన తర్వాత కూడా కేంద్రం ఎందుకు స్పందించడం లేదు. కనీసం సీబీఐ వాళ్లు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. తుమ్మిడిహెట్టిపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈ విషయాలను మోదీ దగ్గర కిషన్‌రెడ్డి చెప్పాలి కదా? అంతర్రాష్ట్ర జలవివాదాలు రాష్ట్రాలే పరిష్కరించుకోవాలని మోదీ చెబుతున్నారు కదా? వచ్చే నెల1న ఆదిలాబాద్‌కు వెళ్తున్నా. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎలా దారిలోకి రాడో చూస్తా.

# బాల్యవివాహాలు, గృహహింస.. దక్షిణాదిన తెలంగాణలోనే అత్యధికం

**భారతీయుల గుండె లయ తప్పుతోందన్న జాతీయ సర్వేలు**

**దేశంలో 60 శాతానికి పైగా మరణాలకు అసాంక్రమిక వ్యాధులే కారణం**

**ఆందోళనకరంగా పెరుగుతున్న గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం కేసులు**

**మహిళల్లో గణనీయంగా పెరిగిన ఇంటర్నెట్ వాడకం, బ్యాంకు ఖాతాలు**

దేశంలో మారుతున్న జీవనశైలి ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. జాతీయ 'నమూనా రిజిస్ట్రేషన్ వ్యవస్థ' (SRS), జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS-6) విడుదల చేసిన తాజా నివేదికలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో సంభవిస్తున్న మొత్తం మరణాలలో 60 శాతానికి పైగా గుండె జబ్బులు, క్యాన్సర్, శ్వాసకోశ సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధుల (NCD) వల్లే జరుగుతున్నాయని ఈ సర్వేలు తేల్చాయి. నివేదికల ప్రకారం.. దేశంలో అసాంక్రమిక వ్యాధుల మరణాల్లో ఏకంగా 32.1 శాతం కేవలం గుండె జబ్బుల కారణంగానే సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం కేసులు తీవ్ర ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. పురుషుల్లో మధుమేహుల సంఖ్య 20.9 శాతానికి, మహిళల్లో 17.8 శాతానికి చేరింది. మరోవైపు, 15–29 ఏళ్ల యువతలో ఆత్మహత్యల మరణాలు 19 శాతానికి పెరగడం కలచివేస్తోంది. అయితే, అంటువ్యాధుల మరణాలు తగ్గడం, రక్తపోటు సమస్య స్వల్పంగా నియంత్రణలో ఉండటం కొంత ఊరటనిచ్చే అంశం. ఈ సర్వేలో మహిళల సామాజిక–ఆర్థిక స్థితిగతులపై ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో ఇంటర్నెట్ వినియోగించే మహిళల సంఖ్య 33.3 శాతం నుంచి 64.3 శాతానికి పెరిగింది. ఈ విషయంలో కేరళ (87.3 శాతం) అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణ (64.8 శాతం), ఆంధ్రప్రదేశ్ (63.6 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దాదాపు 89 శాతం మంది



మహిళలకు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. అయితే, మహిళలు ఆర్థికంగా ముందడుగు వేస్తున్నప్పటికీ బాల్యవివాహాలు, గృహహింస వంటి సామాజిక రుగ్మతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటికీ 20 శాతం బాల్య వివాహాలు జరుగుతుండగా, 22.3 శాతం మంది మహిళలు భర్తల నుంచి గృహహింసను ఎదుర్కొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా 30.8 శాతం మంది మహిళలు గృహహింస బాధితులుగా ఉన్నట్లు సర్వేలో తేలింది.

## బద్రీనాథ్ యాత్రకు మహా రద్దీ: 30 కి.మీ. ట్రాఫిక్ జామ్‌తో యాత్రికుల నరకయాతన!

పవిత్ర చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తడంతో బద్రీనాథ్ వెళ్లే మార్గంలో తీవ్రమైన ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో జోషీమఠ్ సమీపంలో దాదాపు 30 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వేలాది మంది యాత్రికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయి నరకయాతన అనుభవిస్తున్నారు. చార్‌ధామ్‌తో పాటు హేమకుండ్ సాహిబ్ యాత్ర కూడా ఒకేసారి ప్రారంభం కావడంతో ఊహించని రీతిలో రద్దీ పెరిగింది. ఫలితంగా విష్ణుప్రయాగ్ సహా పలు కీలక ప్రాంతాల్లో వాహనాలు ముందుకు కదలడం లేదు. శనివారం ఒక్కరోజే జోషీమఠ్ సమీపంలోని 'జీరో బ్యాండ్' వద్ద 8 కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీరాయి. ఇరుకైన కొండ మార్గాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో యాత్రికులు తిండి, నీరు, కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భారీ రద్దీ కారణంగా అత్యవసర సేవలు అందించే అంబులెన్సులు సైతం ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. ఈ భీకర ట్రాఫిక్‌కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు, పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు జోషీమఠ్ వద్ద 'గేట్ సిస్టమ్' (వన్‌వే) విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద, ప్రతి 30 నిమిషాలకు ఒకవైపు వాహనాలను మాత్రమే అనుమతిస్తూ నెమ్మదిగా రద్దీని క్లియర్ చేస్తున్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉన్నందున, యాత్రికులు తమ ప్రయాణాలను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలని, అధికారుల సూచనలను తప్పక పాటించాలని పోలీసులు కోరుతున్నారు.



# పదవి విరమణ పొందిన పోలీసు అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘన సన్మానం






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా లో పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయం లో ఘనసన్మానంబీబినగర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తునా ఏఎస్ఐ రవి కుమార్, ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ విధులు నిర్వర్తిస్తునా ఏఎస్ఐ కేశవరెడ్డి తమ విధి నిర్వహణను విజయవంతంగా పూర్తి చేసుకొని పోలీస్ సర్వీస్ నుండి పదవీ విరమణ పొందారు వారి సుదీర్ఘమైన, నిస్వార్థమైన సేవలను గౌరవిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్.. పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారు చూపిన ప్రతిభను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రిటైర్డ్ అధికారులకు తమ నూతన జీవితం ప్రశాంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇన్నాళ్లూ మీరు క్రమశిక్షణతో ప్రజల కోసం రాత్రింబవళ్లు శ్రమించారు. ఇకపై మీ విలువైన సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపండి. మీ భవిష్యత్తు జీవితాన్ని కుటుంబంతో కలిసి ఎంతో సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ఆరోగ్యంగా గడపాలి" అని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని, వారికి సుఖసంతోషాలతో కూడిన విశ్రాంత జీవితం లభించాలని ఆకాంక్షించారు

# ఆచార్య రమేష్ గురూజీ, రవీందర్ బాపూజీల ఆధ్వర్యంలో "పాదపూజ"

## వేసవి శిబిరంలో సూర్య నమస్కారాలు- యోగా- ధ్యానం- సాధన




యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

తల్లి, తండ్రి, గురువు, అతిథి ప్రత్యక్ష దైవాలని యోగ రత్న ఆచార్య రమేష్ గురూజీ తెలిపారు. వారిని పూజించాలని, వారి ఆశీస్సులు పొందాలని సూచించారు. సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ గుట్టల మధ్యనున్న బ్రీత్ మౌంటెయిన్ రిట్రీట్ సెంటర్ (అరబిందో ఆశ్రమం) లో ఆచార్య రవీందర్ బాపూజీ ఆధ్వర్యంలో పిల్లల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా "పాదపూజ" ఉత్సవం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేసవి శిబిరంలో పాల్గొన్న పిల్లల తల్లిదండ్రులను ఈ వేడుకకు ఆహ్వానించారు. తల్లిదండ్రులే కనిపించే దైవాలని భావించి పిల్లలు వారి తల్లిదండ్రుల పాదాలను వివిధ నదుల నుంచి తెచ్చిన జలాలతో కడిగారు. పసుపు కుంకుమలతో వారి పాదాలను అలంకరించారు. పూలమాలలను తల్లిదండ్రుల మెడలో వేసి చేతులు జోడించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ పిల్లల భక్తికి మెచ్చిన తల్లిదండ్రులు వారి తలలపై మంగళ అక్షతలు వేసి ఆశీర్వదించారు. చేతులు చాచి తమ గుండెలకు హత్తుకుని ఎప్పటికీ తోడునీడగా ఉంటామని తమ అభిమానాన్ని ప్రదర్శించారు. పిల్లల నోటికి పండ్లను తినిపించారు పిల్లలు సైతం తమ తల్లిదండ్రుల నోటికి పండ్లు తినిపించి ముద్దుల వర్షం కురిపించారు. తాము తెలిసి తెలియక ఇప్పటివరకు ఏమైనా తప్పులు చేసి ఉంటే క్షమించాలని తల్లిదండ్రులను పిల్లలు వేడుకున్నారు. ఇకనుంచి తల్లిదండ్రుల మాట వింటామని, వారి మార్గదర్శకత్వం లో నడుస్తామని, చివరి వరకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. భావోద్వేగా పూరితంగా కొనసాగిన పాదపూజ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు పిల్లలు అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యారు. పాద పూజలో



పాల్గొన్న తల్లిదండ్రులపై పిల్లలపై రవీందర్ బాపూజీ, రమేష్ గురూజీ, వెంకటేశ్వర బాపూజీ, శివకుమారి అమ్మ, వనజ లక్ష్మి అమ్మలు పుష్ప వర్షం కురిపించారు. అరబిందో ఆశ్రమం మేనేజర్ సలాం ఆజాద్ పాదపూజ ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

### సంతోషంలో పిల్లలు

సిద్ధ సమాధి యోగ గురువు ఆచార్య రవీందర్ బాపూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో సూర్య నమస్కారాలు, యోగా, ధ్యానం సాధన చేయిస్తున్నారు. కొలనులో ఈత కొట్టడం, ప్రకృతిని ఆస్వాదిస్తూ గుట్టలపై ట్రిక్కింగ్ చేయడం, అడవి మార్గంలో నడవడం దినచర్య. సాహస క్రీడలు ఆడడం విలువిద్య నేర్చుకోవడం రెండు గుట్టల మధ్యన ఏర్పాటు చేసిన జీప్ లైన్ పై భయం లేకుండా తిరగడం, రాచకొండ లో రాజులు పరిపాలించిన కాలంలో నిర్మించిన కట్టడాలను సందర్శించి వాటి చరిత్ర అప్పటి సంస్కృతి అధ్యయనం చేయడం లాంటివి చేశారు. రసాయనాలు లేని ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార పదార్థాలను భుజించారు. గిరిజనుల రైతుల జీవనశైలిని అధ్యయనం చేశారు. వన్యప్రాణులను ప్రత్యక్షంగా వీక్షించారు. పట్టణవాసానికి దూరంగా ప్రశాంతమైన ప్రకృతి మధ్య వేసవి శిబిరాన్ని ఆనందోత్సాహాలతో గడుపుతున్నారు

# కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పలుసేవ కార్యక్రమాలు

## ప్రసిద్ధ హనుమాన్ దేవాలయంలో ప్రసాదం పంపిణీ- వృద్ధాశ్రమంలో అన్న ప్రసాద వితరణ



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ప్రసిద్ధ హనుమాన్ దేవాలయంలో 2,000 మందికి పైగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేయబడింది. భక్తులు "జై శ్రీరామ్" నినాదాలతో భక్తిశ్రద్ధలతో




ప్రసాదాన్ని స్వీకరించారు. వృద్ధాశ్రమంలో 40 నుండి 50 మంది వృద్ధులు మరియు వికలాంగులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయబడింది. వారు ఎంతో ఆనందంతో, సంతృప్తిగా భోజనం స్వీకరించి సమితి సభ్యులను ఆశీర్వదించారు. ఈ రెండు సేవా కార్యక్రమాల విజయానికి సమితి అధికారులు, సభ్యులు మరియు మిత్రులు అందించిన సహకారంఅమూల్యమైనది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ సేవా కార్యక్రమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# ఊర్కొండలో మహిళా ఎస్సై రమాదేవికి ఘన సన్మానం



కల్వకుర్తి, మే 30 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఊర్కొండ మండలం ఏర్పాటు అనంతరం తొలి మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు విచ్చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా సైబర్ క్రైమ్ ఇంచార్జి ఎస్సై రమాదేవికి యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు జెట్టి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా పోలీసు అధికారిణిగా ఆమె బాధ్యతలు చేపట్టడం ఊర్కొండ మండలానికి గర్వకారణమని, ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ప్రజల్లో అవగాహన కల్పనలో రమాదేవి విశేష కృషి చేయాలని కోరుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోస్థానిక నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఎక్సైజ్ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4.22 లక్షల ఆదాయం

కల్వకుర్తి, మే 30 వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన వాహనాల వేలం పాట ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 4,22,016 ఆదాయం సమకూరింది. వివిధ కేసుల్లో పట్టుబడిన 18 వాహనాలను వేలం వేయగా, వాటిలో 14 వాహనాలు విక్రయించబడ్డాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి. గాయత్రి సమక్షంలో జరిగిన ఈ వేలం పాటలో ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ. 2,95,000 కాగా, పోటీగా జరిగిన బిడ్డింగ్ ద్వారా జీఎస్టీతో కలిపి మొత్తం రూ. 4,22,016 ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డితో పాటు సిబ్బంది జంగయ్య, మునీందర్, చంద్రశేఖర్, జనార్దన్ రెడ్డి, సిద్ధార్థ్, అనిల్, తేజశ్రీ, సునీత పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ యువనాయకులు తరుణ్ నాయక్ జన్మదిన వేడుకలు



వార్త మిర్రర్సంస్థాన్ నారాయణపురం, ప్రతినిధి :మే 30 :– సంస్థాన్ నారాయణపురం మండలం బిఆర్ఎస్ పార్టీ పిటిఎన్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు పానుగోతు తరుణ్ నాయక్ జన్మదిన వేడుకలను ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ రిపోర్టర్ సంగిశెట్టి ధనుంజయ్, బోయ అనిల్ కుమార్, సింగం కృష్ణ, హాజరై ఆయనకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, స్నేహితులు,తదితరులు,పాల్గొన్నారు



# ప్రైవేటు వద్దు అంగన్వాడి ముద్దు.. అమ్మ మాట అంగన్వాడి బాట....

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 30

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వడ్డెర కాలని గ్రామ పంచాయతీలో సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ సమావేశంలో మాట్లాడుతూ అంగ న్వాడీ కేంద్రంలో కి పిల్లలను పంపాలని ప్రీస్కూల్ విద్య పిల్లల భవిష్యత్తుతో పునాదిలా ఉంటుందని వారి మానసిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని, పిల్లల మేధో వికాసం మెరుగుపడడానికి అంగన్వాడీ ప్రీస్కూల్ విద్య చాలా వరకు పిల్లలను మంచి మార్గంలో నడవడానికి ఎంతగానో తోడ్పడుతుందని ప్రైవేట్ స్కూల్ కు ధీటుగా అంగన్వాడి బోధన ఉంటుందని, ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దివ్య జ్యోతి, వార్డు సభ్యులు రాజేశ్వరి, అంగన్వాడి టీచర్ బియ్యాని సుజాత, కారోబార్ జలంధర్, వివో ఏ రోజా, కమల, లతికా, రమేష్ , విజయ, లక్ష్మీ పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 3.27 కోట్లు ఆమోదం

## మొదటి ప్రాధాన్యత స్మశాన వాటికల అభివృద్ధి, సిసి రోడ్లు, డ్రైనేజీలకు నిధులు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 30 చౌటుప్పల్ పురపాలక సంఘ సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రగతి, ప్రజల అత్యవసర అవసరాలే ధ్యేయంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ?ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం పట్టణంలోని ప్రధానంగా రెండు స్మశాన వాటికల అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం ఆమోదించింది. పట్టణంలోని వివిధ వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యల పరిష్కారానికి రూ. 3 కోట్ల 27 లక్షల భారీ నిధులను మంజూరు చేస్తూ కౌన్సిల్ సుదీర్ఘ చర్చల అనంతరం ఆమోదం తెలిపింది. ఈ నిధులతో పట్టణంలోని వివిధ వార్డులలో క్రింది అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ?అత్యవసర మురుగు కాలువల (డ్రైనేజీ) నిర్మాణాలు.సిసి రోడ్ల నిర్మాణాలు పట్టణాన్ని వెలుగులతో నింపేందుకు కొత్త వీధి లైట్ల ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పన ?అధికారులతో ముఖాముఖి -- వార్డు సమస్యలపై మాట్లాడడం జరిగింది. వివిధ ప్రభుత్వ విభాగాల (లైన్ డిపార్ట్‌మెంట్) అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. ?వీధి దీపాలు, పాత విద్యుత్ స్తంభాల మార్పిడిపై విద్యుత్ శాఖ ఎ ఈ సతీష్‌తో చర్చించారు. తాగునీటి లీకేజీల నివారణ, అమృత్ 2.0 వాటర్ ట్యాంక్ల నిర్మాణ నిర్వహణపై మిషన్ భగీరథ ఏ ఈ శ్వేత, ఏ ఈ వినయ్ కుమార్‌లతో సమీక్షించారు. ప్రధాన రహదారులు, వలిగొండ రోడ్డు మరమ్మతులపై ఆర్ అండ్ బి ఏ ఈ నవీన్‌తో చర్చించారు. ?వైద్యరంగం మున్సిపల్ పరిధిలో కొత్తగా నాలుగు బస్తీ దవాఖానాలు మంజూరైనట్లు ఆరోగ్య శాఖ ప్రతినిధి డాక్టర్ కాటంరాజు కౌన్సిల్‌కు తెలిపారు. పట్టణంలో ప్రజారోగ్యం, పాఠశాలల వసతులపై విద్యాశాఖ ఎంఈఓ గురువారావు, అంగన్వాడి సూపర్‌వైజర్ శోభారాణి, ఎఫ్ఆర్ఓ లతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ?ఈ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ నితీష్ రెడ్డి, ఆర్ఓ అంజయ్య, సీనియర్ అసిస్టెంట్లు రఘుపతి, దీప, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళల సమస్యల పరిష్కారానికి ముందడుగు జెండర్ రిసోర్స్ సెంటర్

### డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి





దేవరకొండ, మే 30 వార్త మిర్రర్::మహిళల సాధికారికతకు కృషి చేయడమే కాకుండా వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు ప్రభుత్వం జెండర్ రిసోర్స్ సెంటర్లను చేపడుతుందని డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 99 రోజుల ప్ర ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన ప్రగతి నివేదిక సందర్భంగా డిఆర్డిఏ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ( సెర్ప్ )ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం( జెండర్ రిసోర్స్ సెంటర్) ను దేవరకొండ పట్టణంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పలు ఘటనాలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలత చెందడం మినహా ఎవరికి చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోయి మానసికంగా కుంగి పోతున్నారని తెలిపారు. ఇలాంటి వారందరికీ జెండర్ రిసోర్స్ సెంటర్ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. సమాజంలోని స్త్రీలు ఎవరైనా సరే ఈ కేంద్రాన్ని ఆశ్రయించి సాయం పొందవచ్చునని అన్నారు. అన్యాయానికి గురైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యకు పరిష్కారం లభించే విధంగా సహకారం అందిస్తారని వివరించారు. కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహహింస, ఆరోగ్యం, పోషకాహారం పై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు, బాధితులు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చునని సూచించారు. అలాగే 72 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన చెక్కును అందజేశారు. అనంతరం జెండర్ కమిటీ సభ్యులను, మండల సమాఖ్య ఓబీలను, వివో ఏ లను సన్మానించారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దానియేలు, సీఐ వెంకట్ రెడ్డి, సెర్ప్ పీఎం లింగం గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, సిడిపిఓ చంద్రకళ, సీసీలు, జెండర్ కమిటీ సభ్యులు, వివో ఏలు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి... బ్యాంక్ చైర్మన్ రమేష్

### ఆన్‌లైన్ సేవలు,రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 30

చౌటుప్పల్ మండల పరిధిలోని పోచంపల్లి బ్యాంకు (చౌటుప్పల్ బ్రాంచి) శనివారం తన 16వ వార్షికోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని బ్రాంచి కార్యాలయంలో ఖాతాదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బ్యాంక్ చైర్మన్ రమేష్,బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ.. ఖాతాదారుల నమ్మకం, నిరంతర సహకారంతోనే బ్యాంకు నేడు ఈ స్థాయికి చేరుకుందని, పురోభివృద్ధి సాధించినందుకు వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం చౌటుప్పల్ బ్రాంచి రూ. 68 కోట్ల భారీ వ్యాపార టర్నోవర్‌తో విజయవంతంగా కొనసాగుతోందని ఆయన వెల్లడించారు.? సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని అవగాహన కల్పించారు.సమయాన్ని ఆదా చేసుకునేందుకు బ్యాంకు అందిస్తున్న అత్యాధునిక ఆన్‌లైన్, డిజిటల్ సేవలను వినియోగించుకుని ఆర్థిక లావాదేవీలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. బ్యాంకులో డిపాజిట్ చేసి అధిక వడ్డీని పొందాలని, అలాగే బ్యాంకు అందిస్తున్న అన్ని రకాల రుణ సదుపాయాలను (గోల్డ్ లోన్, వ్యాపార, వ్యక్తిగత రుణాలు) అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.?"ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకు సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పూర్తి సహకారం అందిస్తారు."ఈ వార్షికోత్సవ వేడుకల్లో చౌటుప్పల్ బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఇతర బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, ప్రముఖులు పాల్గొన్నారు..

# రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలని అంగన్వాడి కేంద్రానికి పంపాలి

### అమ్మ మాట అంగన్వాడి బాట



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 30

మహిళా వారోత్సవాల సందర్భంగా అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ పరిధిలో గల రెండవ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఆరు నెలలు నిండిన ప్రతి ఒక్క పిల్లలని అంగన్వాడి కేంద్రానికి పంపాలని కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా అంగన్వాడి పని చేస్తుందని మంచి వాతావరణంలో వారికి అనువైన పద్ధతిలో ఆటపాటలతో సృజనాత్మకతలతో పిల్లలకి విద్యను బోధిస్తూ ఆటలలో పాటలలో జనరల్ నాలెడ్జిలో పిల్లలను ముందు స్థానంలో ఉంచుతుందని తల్లిదండ్రులు ప్రైవేటు స్కూల్ లపై మోజు తగ్గించి పిల్లల భవిష్యత్తును బంగారు బాటలాగా తీర్చిదిద్దాలని పిల్లల పట్ల తల్లిదండ్రులకు బరువు బాధ్యతలతో వారిని మంచి నడవడివైపు సాగించాలని అందులో భాగంగా అంగన్వాడీ ఎంచుకొని పిల్లలు మానసిక ఎదుగుదలకు చాలా తోడ్పడుతారని ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి ఒక అవకాశాలను అందుకున్నట్టుగా మంచి తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును ఆలోచించి అంగన్వాడి బాటలో నడిపించి వారి మైలురాళ్లు అందుకునే బాధ్యత తల్లిదండ్రులదే కాబట్టి కచ్చితంగా ఫ్రీ స్కూలుకు సంబంధించిన 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడికే పంపాలని వారి నుండి అందుకునే సేవలో కచ్చితంగా అందుకోవాలని తెలియపరచినారు. అంగన్వాడిలో చేర్పించే ముందు పిల్లలకి విద్యారంభ దశ అనే సర్టిఫికెట్ ఇస్తూ వారి ప్రీస్కూల్ ప్రవేశ తేదీని, అంగన్వాడి నుండి స్కూలుకి వెళ్లే తేదీని సర్టిఫికెట్ ద్వారా అందజేయబడుతుందని తెలియపరిచినారు. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఉప్పుల రమాదేవి మిట్టపల్లి పద్మ డికొండ ఉమాదేవి, ప్రీస్కూల్ పిల్లలు తల్లులు పాల్గొనడం జరిగింది. గ్రామపంచాయతీ లెవల్లో వడ్డే లింగాపూర్ ఒకటి రెండు మూడు సెంటర్లలో కొత్తపేట వడ్డెర కాలనీలో ఈ కార్యక్రమం జరుపుకోవడం జరిగింది.

# టీమిండియా బ్యాటింగ్ సంక్షోభం..టెస్ట్ జట్టుకు సంజీవనిలా మారబోతున్న నలుగురు యంగ్ ప్లేయర్స్




భారత టెస్ట్ క్రికెట్ జట్టు బ్యాటింగ్ ప్రదర్శన ప్రస్తుతం తీవ్ర విమర్శల పాలవుతోంది. సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో 3-0 తేడాతో ఓడిపోవడం, సౌతాఫ్రికా పై కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేక ఇబ్బంది పడటం వంటి సంఘటనలు జట్టు పరిస్థితిని తెలియజేస్తున్నాయి. ఇలాంటి సమయంలో అసలు టీమిండియా బ్యాటింగ్‌కు కొత్త ఎనర్జీ ఎవరు ఇవ్వగలరు అనే ప్రశ్న తలెత్తుతోంది. భారత టెస్ట్ క్రికెట్ జట్టు బ్యాటింగ్ ప్రదర్శన ప్రస్తుతం తీవ్ర విమర్శల పాలవుతోంది. సొంత గడ్డపై న్యూజిలాండ్‌తో 3-0 తేడాతో ఓడిపోవడం, సౌతాఫ్రికా పై కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించలేక ఇబ్బంది పడటం వంటి సంఘటనలు జట్టు పరిస్థితిని తెలియజేస్తున్నాయి. ఇలాంటి సమయంలో అసలు టీమిండియా బ్యాటింగ్‌కు కొత్త ఎనర్జీ ఎవరు ఇవ్వగలరు అనే ప్రశ్న తలెత్తుతోంది. దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారిస్తే అనేకమంది యువ ఆటగాళ్లు నిలకడగా భారీ పరుగులు చేస్తూ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ ఆటగాళ్లు కేవలం స్పిన్నర్లను మాత్రమే కాదు, వేగవంతమైన పేస్ బౌలింగ్‌ను కూడా తమ అద్భుతమైన టెక్నిక్, సహనంతో ఎదుర్కోగలరు. ఈ యువకులకు అవకాశం ఇస్తే, టీమిండియా బ్యాటింగ్ లైనప్‌కు కొత్త బలం చేకూరుతుంది. టెస్ట్ జట్టులో మార్పు తీసుకురాగల నలుగురు ముఖ్యమైన ఆటగాళ్లు ఎవరో తెలుసుకుందాం 1. రవిచంద్రన్ స్మరణ్ కేవలం 22 సంవత్సరాల వయసులోనే రవిచంద్రన్ స్మరణ్ దేశవాళీ క్రికెట్‌లో పెద్ద పేరు సంపాదించుకున్నాడు. 2024 లో తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఈ ఆటగాడు కేవలం 19 ఇన్నింగ్స్‌లలో 1179 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 78 కంటే ఎక్కువ ఉంది. అంటే అతను క్రీజ్‌లో ఎక్కువ సేపు నిలబడి ఆడగలడని అర్థం.

ఇప్పటివరకు నాలుగు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలు నమోదు చేసుకున్నాడు. నాల్గవ స్థానంలో అతని బలమైన బ్యాటింగ్ టీమిండియా మిడిల్ ఆర్డర్‌కు పెద్ద ఉపశమనం ఇవ్వగలదు. 2. యశ్ ధుల్ అండర్-19 ప్రపంచ కప్‌ను భారత్‌కు అందించిన కెప్టెన్ యశ్ ధుల్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లోనూ తనదైన ముద్ర వేస్తున్నాడు. అతను ఇప్పటివరకు ఆడిన 38 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 47 సగటుతో 2777 పరుగులు చేశాడు. 9 సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు చేసిన యశ్ బలంగా, సహనంతో కూడిన బ్యాటర్‌గా పేరు పొందాడు. టెస్ట్ క్రికెట్‌లో నెమ్మదిగా ఉండే, సవాలుతో కూడిన పిచ్‌లలో అతను జట్టుకు విలువైన ఆటగాడు కాగలడు. 3. యశ్ రాథోడ్‌గత రంజీ సీజన్‌లో విదర్భ జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో ముఖ్య పాత్ర పోషించిన యశ్ రాథోర్, ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో నమ్మదగిన బ్యాటర్లలో ఒకరిగా పరిగణించబడుతున్నాడు. 25 ఏళ్ల యశ్ 27 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 61 కంటే ఎక్కువ సగటుతో 2449 పరుగులు చేశాడు. అతని 9 సెంచరీలు అతని అద్భుత ప్రదర్శనను తెలియజేస్తాయి. మిడిల్ ఆర్డర్‌లో అతను లాంగ్ ఇన్నింగ్స్‌లు ఆడగల కెపాసిటీ కలిగి ఉన్నాడు. 4. రింకూ సింగ్‌సాధారణంగా టీ20 ఫార్మాట్‌లో తన ఫినిషింగ్ నైపుణ్యం, భారీ సిక్సర్ల కోసం రింకూ సింగ్‌ను గుర్తుంచుకుంటారు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని రికార్డు మరింత అద్భుతంగా ఉంది. రింకూ 52 మ్యాచ్‌లలో 59 కంటే ఎక్కువ సగటుతో 3677 పరుగులు చేశాడు. ఇందులో 9 సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని అద్భుతమైన టెక్నిక్, నిగ్రహం అతన్ని టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకోవడానికి బలమైన పోటీదారుడిని చేశాయి.

# తార్నాక సుప్రీత హాస్టల్లో యువతి అనుమానాస్పద మృతి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 30 : తార్నాకలోని ఓ హాస్టల్ గదిలో యువతి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అఫ్రీన్ బీ (25) అనే యువతి తార్నాక స్ట్రీట్ నెంబర్ 3 లోని సుప్రీత హాస్టల్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం ఆమె తన గదిలో ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, యువతి సుమారు ఎనిమిది నెలల క్రితం కుటుంబ సభ్యుల నుంచి విడిగా ఉంటున్నట్లు తెలిసింది. మృతికి గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 11కేవీ బ్రేకర్ వద్ద వైర్ తెగి చెలరేగిన మంటలు

### కోత కోసిన వరి, మొక్కజొన్న కొయ్యలు దగ్ధం

### మంటలను అర్పిన గ్రామస్తులు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 30

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో శనివారం సుమారు ఉదయం 10.50 గంటల సమయంలో గ్రామాన్ని అనుకోని ఉన్న పొలాల్లో 11కేవీ వెళ్ళే లైన్ కు అత్యవసర సమయాలలో వాడే బ్రేకర్ వద్ద సబ్ లైన్ తెగి మంటలు వ్యాపించి కోత కోసిన వరి, మొక్కజొన్న కొయ్యలు పూర్తిగా మంటలు వ్యాపించి గ్రామంలోకి వ్యాపించే సమయంలో అక్కడే ఉన్న రైతులు గ్రామప్రజలు తెలియజేయగా అందరూ సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయగలిగారు. ఇట్టి విషయం స్థానిక విద్యుత్ అధికారులకు తెలియజేయగా వారు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు అక్కడే ఉన్న రైతులు విద్యుత్ ఇంజనీర్ నవీన్ ను నిలదీయగా ఈ సంఘటన మీ నిర్లక్ష్యంతో జరిగింది అని రైతులు చెప్పగా నిర్లక్ష్యపు సమాధానం ఇస్తూ దీనికి మేము బాధ్యులం కాదు, రైతులు మీరే మంట పెట్టారు అని ఆగ్రహం వ్యక్తం చేసి రైతులను కించపరిచే విధంగా హేళనగా మాట్లాడారు అని రైతులు చెబుతూ బాధను వెలిబుచ్చారు. ఇకనైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా మునుముందు ఇలాంటి సంఘటన జరగకుండా చూసుకోవాలని రైతులు సంతోష్ రావు, అంబాల రాజ రెడ్డి , రాజు , రాజశేఖర్ గ్రామ ప్రజలు కోరారు.



# లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్ కు ఘన సన్మానం

వార్త మిర్రర్, మందమర్రి, మే 30:పీఎస్టిఎస్ ఆత్మీయ సమ్మేళనం శనివారం కరీంనగర్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మందమర్రి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, చాటర్ ప్రెసిడెంట్, పాస్ట్ ప్రెసిడెంట్, ప్రస్తుత డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్, లయన్స్ క్లబ్ తరపున పేద ప్రజలకు చేసిన సేవలకు,నూతన సభ్యులను చేర్పించుటకు కృషి చేసినందుకు మందమర్రి క్లబ్ ను మరింత ముందుకు తీసుకుపోతున్న సందర్భంగా సుదర్శన్ ను ఆల్ ఇండియా లయన్స్ క్లబ్ కౌన్సిల్ చైర్మన్ ఘట్టమనేని బాబురావు అభినందిస్తూ, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బాబురావు మాట్లాడుతూ, సుదర్శన్ గత 15 సంవత్సరాల నుంచి మందమర్రి లయన్స్ క్లబ్ లో వందలాది సేవా కార్యక్రమాలు నిర్వహించి, లయన్స్ క్లబ్ కు సేవలు అందించారని ఆయన సేవాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూసాల వెంకటరత్నం, సోత్కు రత్నజానకి, పూసల సుజాత లు పాల్గొన్నారు.

# స్మృతి కాబోయేవాడితో ఉన్న ఈ అమ్మాయ్ ఎవరు.! పలాష్ ఇంత పెద్ద చీటరా.? వైరల్ ఫోటోలు

భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఇప్పుడు కొత్త ట్విస్ట్ బయటపడింది. భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు స్మృతి మంధాన. పెళ్లి కొడుకు తరపున వారు చెప్పినా ఆమె తండ్రి ఆరోగ్యమే ముఖ్యమని చెప్పడంతో.. పెళ్లి ఆగిపోయింది. అయితే అదేరోజు రాత్రి పలాశ్ ముచ్చల్ కూడా అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైరల్ ఇన్ఫెక్షన్.



# గ్రామ కార్యదర్శికి ఆత్మీయ సన్మానం

వార్త మిర్రర్ మందమర్రి,మే 30:

మందమర్రి మండలం ఆదిల్ పేట గ్రామ కార్యదర్శి హిమబిందు బదిలీపై వెల్తుండగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నెందుగురి పున్నం ఆద్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా సర్పంచ్ పున్నం మాట్లాడుతు అంకిత బావం, నిబద్ధత తో విదులు నిర్వహించిన కార్యదర్శి బదిలీ కావడం బాధాకరమన్నారు. తన పదవి కాలంలో గ్రామస్థులకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. అనంతరం కార్యదర్శి హిమబిందు మాట్లాడుతు తన పదవి కాలంలో సహకరించిన ప్రజా ప్రతినిదులకు గ్రామస్థులకు ఆమే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొట్రంగి రాజన్న, వార్డ్ సభ్యులు కటికల లక్ష్మి, రాధబాయి, నెందుగురి లిఖిత, ఆకుల వేణు, టకిర రాజ్, ఈజిఎస్ టిఏ కుమార్, ఈజిఎస్ ఫెల్ట్ అసిస్టెంట్లు ఈద లింగయ్య, నెందుగురి బాపు, కారోబార్ టకిర మల్లేష్ లు పాల్గోన్నారు.